మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :136 ఎడిటర్: గొడిశాల సోమయ్య శనివారం 12-10-2024 పేజీలు :4 వెల : 2రూ

# దసరా వేళ మరో తీపికబురు.




నమస్తే హైదరాబాద్ : దసరా పండుగ వేళ తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో తీపికబురు వినిపించింది. తెలంగాణలో నిరుపేదలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో మరో కీలక ముందడుగు పడింది. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభిస్తామంటూ మంత్రులు చాలా రోజులుగా చెప్తూ వస్తుండగా.. ప్రజల్లో ఓ ఉత్కంఠ నెలకొంది. అయితే.. ఆ ఉత్కంఠకు తెరదించుతూ కీలక నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు అవసరమైన విధివిధానాలను ప్రకటించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమైంది. త్వరలోనే అర్హులను కూడా ఎంపిక చేసి వారికి మంజూరు పత్రాలను ఇవ్వాలని యోచిస్తోంది. అయితే... ఈ పథకాన్ని పకడ్బంధీగా అమలు చేసేందుకు గానూ.. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని భావించిన సర్కారు.. అందుకు సంబంధించిన జీవో జారీ చేసింది. ఈ మేరకు అధికారులకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది.అయితే.. ఈ గ్రామ కమిటీలో గ్రామ సర్పంచ్ ఛైర్మన్‌గా ఏడుగురు సభ్యులుండగా.. కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తారు. ఈ ఏడుగురు సభ్యుల్లో మహిళ సంఘాల నుంచి ఇద్దరు ఉండనుండగా.. ఎస్సీ, బీసీ సభ్యులు ఉండేలా జాగ్రత్త పడాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. ఇక మున్సిపాలిటీ స్థాయిలోని కమిటీల్లో కౌన్సిలర్, కార్పొరేటర్, ఛైర్మన్ ఉంటారు. అయితే.. ఈ కమిటీలు అర్హులను ఎంపిక చేసే ప్రక్రియలో స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాయి. అయితే.. శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కమిటీల్లో ఉండే సభ్యుల కోసం పేర్లు పంపించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను సర్కారు ఆదేశించింది.

# మారిపోనున్న సీఎం రేవంత్ సొంతూరి రూపురేఖలు.




నమస్తే హైదరాబాద్ : ఎంత ఎత్తుకు ఎదిగిన కన్నతల్లి, పుట్టిన ఊరిని మర్చిపోవొద్దు అంటుంటారు. అచ్చంగా అదే చేస్తున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. తన సొంతూరయిన కొండారెడ్డిపల్లిని తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో పుట్టి పెరిగిన రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎదిగారు. తనను ఇంతవాన్ని చేసిన ఊరికి ఎంతో కొంత చేయాలని భావిస్తున్న రేవంత్ రెడ్డి.. దీపం ఉన్నప్పుడు ఇల్లు చక్కదిద్దుకోవాలన్న సామెతను అనుసరిస్తున్నారు. ఈ క్రమంలోనే.. కొండారెడ్డిపల్లిలో ఏకంగా రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు కాగా.. మరో రూ.170 కోట్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఇప్పటికే.. కొండారెడ్డిపల్లిలో సుమారు రూ.72 లక్షలు పెట్టి గ్రామపంచాయతీ భవనం నిర్మించగా.. దానికి రేవంత్ రెడ్డి తండ్రి అయిన ఎనుముల నరసింహారెడ్డి పేరు పెట్టారు.ఇదిలా ఉంటే.. రూ.45 లక్షలతో వెటర్నరీ హాస్పిటల్, రూ.70 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, రూ.39 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ రెనోవేషన్, రూ.25 లక్షలతో బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్, మోడ్రన్ బస్ షెల్టర్, పార్క్, ఓపెన్ జిమ్, రైతు వేదిక పునరుద్ధరణ, రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఈ అభివృద్ధి పనులను దసరా రోజు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# టీడీపీ బాటలో బీఆర్ఎస్..



నమస్తే హైదరాబాద్ : తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న పార్టీకి పెద్దగా ప్రియారిటి ఇవ్వని బీఆర్ఎస్ ఇప్పుడు పార్టీలో సమూల మార్పుల దిశగా అడుగులేస్తుంది. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వమే పార్టీని ప్రభుత్వం అంటూ.. అడపాదడపా మినహా పెద్దగా తెలంగాణ భవన్‌లో హడావుడి ఉండేది కాదు. ఇప్పుడు ఒక పూర్తి ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ నిర్మాణం, కార్యాలయ కార్యకలాపాల విషయంలో తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ చాలా సిస్టమేటిక్‌గా ఉంటుంది. అధికారంలో ఉన్న లేకపోయినా తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ విధానం గురించి అన్ని పార్టీల నేతలు మాట్లాడుకుంటారు.ఇప్పుడు కేసీఆర్ కూడా గతంలో రెండు దశాబ్దాల పాటు తెలుగుదేశం పార్టీలో కీలక నేతగా, ఎన్టీఆర్ ట్రస్ట్ మెంబర్‌గా, తెలుగుదేశం పార్టీ కార్యాలయ బాధ్యులుగా పని చేసిన రావుల చంద్రశేఖర్‌ని ప్రస్తుతం తెలంగాణ భవన్ ఇన్చార్జిగా నియమించారు. తెలుగుదేశం పార్టీలో నేతల ప్రెస్ మీట్లకు ముందు ఎలాగైతే పార్టీ నుంచి కొంత సమాచారం అందిస్తారు. ఇప్పుడు అలాంటి ప్రాక్టీస్ మొదలుపెట్టారు. నిత్యం ఎవరో ఒక నేత తెలంగాణ భవన్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై రోజు కనీసం రెండు మూడు ప్రెస్ మీట్ అయినా ఉంటున్నాయి. వచ్చిపోయే కార్యకర్తలకు, మీడియా సిబ్బందికి ప్రత్యేకంగా భోజనాలు కూడా ఏర్పాటు చేయించారు. పార్టీ కార్యకర్తల మెంబర్‌షిప్‌తో పాటు వచ్చే ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక విభాగం, పబ్లిక్ రిలేషన్స్- సోషల్ మీడియా కోసం మరొక వింగ్, రోజువారి కార్యకలాపాల కోసం మరికొంతమందిని ప్రత్యేకంగా నియమించారు. వీటితోపాటు త్వరలోనే కార్యకర్తలకు శిక్షణ తరగతులు కూడా ప్రారంభిస్తున్నట్లుగా సమాచారం.

# తెలంగాణకు వర్ష సూచన..



నమస్తే హైదరాబాద్ : తెలంగాణలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న మూడు రోజుల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. కాగా గురువారం తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల మోస్తరు వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, నాగర్ కర్నూల్ తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి.ఇదిలా ఉంటే తెలంగాణలో వ్యాప్తంగా రానున్న మూడురోజులు సైతం వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని.. జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఇక శనివారం రోజుల పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

# ఆన్‌లైన్‌లోనే 'పోలీసు' అనుమతులు



నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 11 అన్ని రకాల పోలీసు అనుమతులను ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి వెల్లడించారు. కమిషనరేట్‌లో శుక్రవారం 'సైబరాబాద్ పోలీస్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీపీపీఎంఎస్)' పోర్టల్‌ను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి వరకు పోలీసు అనుమతుల కోసం దరఖాస్తుదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇకపై అలా ఉండదని, వివరాలను ఆన్‌లైన్‌లో పూర్తిచేసి పేమెంట్ సైతం చెల్లించే అవకాశం కల్పించినట్టు తెలిపారు. నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) సహకారంతో రూపొందించిన సీపీపీఎంఎస్‌తో దరఖాస్తుదారుల సమయం వృథా కాదన్నారు. ప్రస్తుతం కమర్షియల్, టికెట్లతో కూడిన ఈవెంట్లు, బ్లాస్టింగ్‌లకు సంబంధించిన అనుమతులను ఆన్‌లైన్‌లో జారీ

2లో

# ఏపీకి కోట్లు.. తెలంగాణకు సున్నాలు




నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్, అక్టోబర్ 11 కేంద్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.100 కోట్లు ఇచ్చి, తెలంగాణకు గుండు సున్నా మిగిల్చిందని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు విమర్శించారు. ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా, రాష్ట్రానికి ఒక రూపాయి కూడా సాధించలేకపోయారని మండిపడ్డారు. తెలంగాణకు హకుగా రావాల్సిన నిధుల కోసం పోరాటంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. లోక్‌సభలో బీఆర్ఎస్ ఉండి ఉంటే, తెలంగాణకు అన్యాయం జరిగేది కాదన్నారు. కేంద్ర బడ్జెట్‌లోనూ తెలంగాణకు సున్నా కేటాయింపులు చేసి, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం అదనపు గ్రాంట్ కింద రూ.15వేల కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చారని తమకు బాధ లేదని, తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నదే తమ ఆవేదన అని తెలిపారు. నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి తెలంగాణకు మొండి చెయ్యే చూపుతున్నదని విమర్శించారు. తెలంగాణ పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. తెలంగాణను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడాలని, హకుగా రావాల్సిన నిధులను కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఆన్‌లైన్‌లోనే 'పోలీసు' అనుమతులు

చేస్తున్నామని వారం, పది రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. 3నెలల్లో అన్ని రకాల అనుమతులను ఆన్‌లైన్ ద్వారా జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ(ట్రాఫిక్) జోయల్ డేవిస్ పాల్గొన్నారు.

## విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ దంపతులు



నమస్తే హైదరాబాద్ (బోడుప్పల్): కనక దుర్గా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ఇంద్రకీలాద్రిపై కొలువైన విజయవాడ కనకదుర్గ అమ్మవారిని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు వారితో బింగి యోగేష్ యాదవ్ ,జలా నరసింహ యాదవ్ , శ్రీనివాస్ యాదవ్ ,శ్రీకాంత్ యాదవ్ ,అభిలాష ఉన్నారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ.



నమస్తే హైదరాబాద్( శేర్లింగంపల్లి న్యూస్ ) చందానగర్ డివిజన్ పరిధిలోని క్ ఎస్ ఆర్ ఎనక్లేవ్ కాలనీ లో సర్వీ సమాజ్ ట్రస్ట్ శేరిలింగంపల్లి వారి ఆధ్వర్యంలో దసరా పర్వదినం సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత అమ్మవారి దేవాలయం లో జరిగిన పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ప్రత్యేక పూజలు చేసిన ప్యాక్ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి , బాలింగ్ గౌతమ్ గౌడ్,అనిల్ రెడ్డి, కాశినాథ్ యాదవ్,సందీప్ రెడ్డి, సాజిద్, సర్వీ సమాజ్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో 9వ రోజు అన్నప్రసాద కార్యక్రమం



ఘట్కేసర్ అక్టోబర్ 11 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ లోని దేవీ శర నవరాత్రి ఉత్సవాలు నిర్వాహకులు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాల యాదవ్ ఆధ్వర్యం లో నాగులమ్మ గుడి ప్రక్కన అమ్మవారి మండపం లో 9వ రోజు కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.ముత్యాల యాదవ్ మాట్లాడుతూ దేవీ నవరాత్రుల్లో భాగంగా అక్టోబర్ 14న పెద్ద ఎత్తున అమ్మగారి ఊరేగింపు సంబరాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు..

### ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్

నమస్తే హైదరాబాద్ (బోడుప్పల్ ) :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆంజనేయ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ పాల్గొన్నారు. బతుకమ్మ ఆటపాటలతో మహిళలు యువతులు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, ప్రకృతి నుండి వచ్చే పూలతో దేవుడిని పూజించడం మన ఆచారం కాని ఆ పువ్వులనే పూజించే గొప్ప



సంస్కృతి తెలంగాణకే సొంతమని, ఇలాంటి మన గొప్ప సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలని , బోడుప్పల్ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కాలనీ మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు పీఏసీ చైర్మన్ ,ఎమ్మెల్యే గాంధీ దసరా శుభాకాంక్షలు



నమస్తే హైదరాబాద్ ( శేరిలింగంపల్లి న్యూస్) : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు పీఏసీ చైర్మన్ ,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ స్థాపనకు నిదర్శనంగా, విజయాలను అందించే విజయ దశమిగా దసరా పండుగను దేశవ్యాప్తంగా జరుపుకుంటారని విప్ గాంధీ అన్నారు. దసరా రోజున శుభసూచకంగా పాలపిట్టను దర్శించి పవిత్రమైన జమ్మిచెట్టుకు పూజలు చేసే సాంప్రదాయం గొప్పదన్నారు. జమ్మి ఆకును బంగారంలా భావించి పంచుకొంటూ, పెద్దల ఆశీర్వాదాలను అందుకుంటూ, అలయ్ బలయ్ తీసుకొంటూ ప్రేమాభిమానాలను చాటుకోవడం దసరా పండుగ ప్రత్యేకత అని పీఏసీ చైర్మన్ గాంధీ పేర్కొన్నారు. విజయానికి సంకేతమైన దసరా నాడు తలపెట్టిన కార్యాలన్నీ ఫలించాలని ఎమ్మెల్యే అరికపూడి గాంధీప్రార్థించారు. విజయ దశమి స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని దసరా సందర్భంగా పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే గాంధీ కోరుకున్నారు.

## దసరా పండక్కి ఊరు వెళ్తున్నారా, జాగ్రత్తలు పాటించండి సీఐ పరశురాం


ఘట్కేసర్ అక్టోబర్ 11 (నమస్తే హైదరాబాద్) మేడ్చల్ జిల్లా,ఘట్కేసర్ సీఐ పరశురాం దసరా పండగకు వెళ్ళే ప్రజలకు దొంగతనాల నివారణ కై పలు సూచనలు చేశారు, ఊరికి వెళ్ళే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు మరియు బంగారం ఆభరణాలు బ్యాంకు లాకర్లో దాచుకోవాలని తెలియజేశారు, ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి, అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఘట్కేసర్ పోలీసు వారి ఆధ్వర్యంలో దొంగతనాల నివారణకు ప్రజల్లో అవగాహన కోసం మైక్ తో కూడిన వాహనం ఏర్పాటు చేసి ఘట్కేసర్ పీఎస్ పరిధి లో ప్రచారం కోసం పంపడం అయిందని అన్నారు.




## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి

### పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.



నమస్తే హైదరాబాద్ (కూకట్పల్లి): అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రతిష్టాత్మకంగా విద్యను అందించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరు చేసింది. అందులో భాగంగా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా నిర్వహించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన భూమి పూజ, జ్యోతి ప్రజ్వలన, బహిరంగ సభలో పాల్గొన్న



షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా అందరికీ ఒకే చోట అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు నిర్మించడాం చాలా గర్వంగా ఉందని, మొత్తం 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే ఈ పాఠశాలలు నాలుగు నుండి పన్నెండవ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన అందించడంతో పాటు ఒక్కో లైబ్రరీలో ఐదు వేల పుస్తకాలు, అరవై కంప్యూటర్లు, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు మరియు ప్రత్యేకంగా స్పోర్ట్స్ గ్రౌండ్ ను కూడా ఏర్పాటు చేస్తుందని అన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు చర్యలు, తెలంగాణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఐదు వేల పాఠశాలలను మూసివేసిందని, పేదలకు విద్యను దూరం చేయాలన్న కుట్రతో బిఆర్ఎస్ సర్కార్ పనిచేసిందని అన్నారు.

# జీవో 18 జారి పై సగర సంఘం హర్షం..



నమస్తే హైదరాబాద్, (శేరిలింగంపల్లి ) తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అసెంబ్లీ తీర్మానం చేయడంతో పాటు రాబోయే 60 రోజులలో కుల గణనను పూర్తి చేయాలని ప్రణాళిక శాఖ కు బాధ్యతలు అప్పగిస్తూ జీవో 18 ని విడుదల చేయడం పట్ల తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి చర్చలు జరిపిన 24 గంటల లోపు జీవో జారీ చేయడం శుభ పరిణామమని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర తెలిపారు. గత అనేక దశాబ్దాల కాలంగా పోరాటం సాగిస్తున్న బీసీ ఉద్యమకారుల ఆశలు నెరవేరే సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. సమగ్ర కుల గణన చేపట్టడం ద్వారా మెజారిటీ జనాభా కలిగిన బిసి వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జారీ చేసిన జీవో ప్రకారం రాబోయే రెండు నెలల్లో జనగణన పూర్తి చేసి కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధత కల్పిస్తూ ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తమకు పూర్తి విశ్వాసం ఉందని తప్పకుండా సమగ్ర కులగనన పూర్తి చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని శేఖర్ సగర విజ్ఞప్తి చేశారు.



# ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



హనుమకొండ, అక్టోబర్ 11 (నమస్తే హైదరాబాద్) హనుమకొండలోని గోకుల్ నగర్ లో నూతనంగా దేవాలయ కమిటీ, యాదవ సంఘం కమిటీ ఎన్నికైన సందర్భంగా కమిటీ సభ్యులంతా హన్మకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు యాదవ సంఘం ప్రెసిడెంట్ చల్ల రాజు యాదవ్, కమిటీ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు యాదవ్ ,, ఆద్వర్యంలో కమిటి సబ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీని అభినందించి కాలనీ అభివృద్ధికి, దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# వాలీబాల్ ఆటల పోటీలను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కడియం పరమేశ్వర్



నాగారం నమస్తే హైదరాబాద్ :(అక్టోబర్ 11) మండలం కేంద్రంలో శుక్రవారం దసరా పండుగ సందర్భంగా వాలీబాల్ ఆటల పోటీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కడియం పరమేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల వలన వ్యక్తుల మధ్య సంబంధాలు బలపడతాయని మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. బహుమతుల కోసం 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ, కన్నెబోయిన వెంకటబిక్షం,జాజుల వీరయ్య,అనంతుల వెంకటయ్య,దున్నపోతుల చంద్రశేఖర్, ఆవుల నరేష్, కొమ్ము నరేష్,కత్తుల వెంకన్న వంగూరి అంజి, బైరబోయిన మహేష్ బొబ్బిలి మహేష్,గంట వీరాస్వామి, కన్నెబోయిన లింగమల్లు, కన్నెబోయిన నాగరాజు, చీమల వెంకన్న కడియం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి నాయకులు తడకమళ్ళ రవికుమార్




నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి అక్టోబర్ 11: తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలని డిమాండ్ చేస్తూన్నా తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి నాయకుల నేడు తొండ తిరుమలగిరిలో జరిగే ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకుంటారనే ఉద్దేశంతో శుక్రవారం మండల కేంద్రంలోని తెల్లవారుజామున పోలీసులు వారిని ముందస్తు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి తడకమళ్ళ రవికుమార్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశాల మేరకే మమ్మల్ని అరెస్ట్ చేశారని ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని ఇలాంటి అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులు భయపడేది లేదని నేడు తొండ తిరుమలగిరిలో నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమాన్ని బేషరతుగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నోసార్లు ఇలాంటి శంకుస్థాపన కార్యక్రమాలు చేసిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతాలకు మార్చిన సందర్భాలు చాలా ఉన్నాయని స్థానిక భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ గారికి గుర్తు చేశారు. అరెస్టు అయిన వారిలో గునిగంటి సంతోష్, బొంకురి మల్లేష్ , కొండగడుపుల వెంకటేశ్, ఉప్పుల నాగమల్లు, బొజ్జ సాయి కిరణ్, తడకమళ్ల మల్లికార్జున్, తడకమళ్ల అనిల్, పడపాటి మధు, చింతకుంట్ల సురేశ్, సుధాకర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎన్ ఆర్ ఐ శ్రీధర్ రెడ్డి చేయూత





(నమస్తే హైదారాబాద్ ధర్మసాగర్)ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన వక్కల శ్రీనివాస్, పోలేపల్లి కరుణాకర్‌లిలు బుధవారం మరణించగా వారి కుటుంబ సభ్యులకు నారాయణగిరి గ్రామానికి చెందిన వల్లపురెడ్డి శ్రీధర్ రెడ్డి(%చీ=×%) 10వేల రూపాయలు సహాయంగా అందించారు. ఈ మేరకు శుక్రవారం రామన్న యువసేన సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపి సహాయం అందించారు. ఈ సందర్భంగా సాయం అందించిన ఎన్ఆర్ఐ వల్లపురెడ్డి శ్రీధర్ రెడ్డి కి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్న యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడిగా మహేందర్ రెడ్డి....

నమస్తే హైదరాబాద్, శేర్లింగంపల్లి : పి ఆర్ టి యూ రంగారెడ్డి డిస్టిక్ అధ్యక్షుడిగా మహేందర్ రెడ్డి ఎన్నిక అయినారు. ఈ సందర్భంగా చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి నివాసంలో సన్మానించారు ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పోస్ట్ కు తగిన న్యాయం చేయాలని అన్నారు. అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నాపై విశ్వాసంతో పదవి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే వెంకట్ రామ్ రెడ్డి, బి రమేష్, శ్రీకాంత్ రెడ్డి, బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వేలేరులో నూతన ప్రభుత్వ ఉద్యోగులను సన్మానించిన సద్దాంహుస్సేన్





(నమస్తే హైదారాబాద్ ధర్మసాగర్) సద్దాంహుస్సేన్ వేలేరు మండల కేంద్రంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాదించిన ఉద్యోగస్తుల నివాసాలకు వెళ్లి సన్మానించి వారికి వారి కుటుంబ సభ్యులకు స్వీట్ లు తినిపించి శుభకాంక్షలు తెలిపిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాగానే రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ11000 టీచర్ ప్రభుత్వ ఉద్యోగాల నియామాకాలు నిరోద్యోగుల కల్లలో సంతోషం చూడాలని దసరా కానుకగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని ఉద్యోగం పొందిన వ్యక్తులు మరియు సద్దాంహుస్సేన్ కొనియాడారు వేలేరు గ్రామంలో జోగు మహేందర్ ,కొయ్యడ అనూష , గజ్జెల్లి పూర్ణచందర్ , ప్రభుత్వ ఉద్యోగాలు సాదించిన వ్యక్తులకు శుభకాంక్షలు తెలుపుతూ పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కాలేకపోయిన వ్యక్తులు నిరాశ చెందకుండా రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాబ్ క్యాలెండర్ దృష్టిలో ఉంచుకొని మరింత కష్టపడి చదవాలని సద్దాంహుస్సేన్ కోరుకోవడం జరిగింది

కార్యక్రమంలో వార్డు మెంబర్ బైరి అనిల్,మండల యూత్ కాంగ్రెస్ అభ్యర్థి గంగుల రణధీర్ రెడ్డి, యూత్ ఉపాధ్యక్షులు అక్కల ప్రశాంత్, ప్రదాన కార్యదర్శి జెట్టి అరవింద్, కొండి రాజయ్య, గుండు ప్రశాంత్, కూరపాటి శ్రీకాంత్, కుర్సాపెల్లి అజయ్, కొయ్యడ రాజు, గూటం కార్తీక్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


# 380 కోట్ల ఆలయ పనులు రద్దు

నమస్తే హైదరాబాద్ : హైదరాబాద్, అక్టోబర్ 11 రాష్ట్రంలో హిందూ ఆలయాలపై కాంగ్రెస్ సర్కారు కక్షపూరిత వైఖరి అవలంబిస్తున్నది. 9 నెలల్లో ఒక్క ఆలయానికీ నయాపైసా కేటాయించని ప్రభుత్వం.. గత కేసీఆర్ సర్కారు చేపట్టిన పనులను ఒక్క కలం పోటుతో రద్దుచేసింది. ఇప్పటికే సీజీఎఫ్ పన్నును 12 శాతానికి పెంచగా, తాజాగా రూ.380 కోట్ల అభివృద్ధి పనులను రద్దుచేశారు. 150 గ్రామీణ ఆలయాలను సీజీఎఫ్ నిధులతో అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలనూ బుట్టదాఖలు చేశారు. ధూప దీప నైవేద్యం ఆలయాలకు 3 నెలలుగా వేతనాలను నిలిపివేశారు. ఆలయాలపై ప్రభుత్వ అవలంబిస్తున్న వివక్షను ధార్మిక సంఘాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి.

# సినిమా




## సౌందర్య నిర్మించిన ఏకైక చిత్రం ఎంతో తెల్సా.?



మహానటి సావిత్రి తర్వాత తెలుగు ఇండస్ట్రీకి దొరికిన ఆణిముత్యం అలనాటి తార సౌందర్య. సాంప్రదాయమైన క్యారెక్టర్లలో నటించి ఏమాత్రం గ్లామర్‌కు ఆస్కారం ఇవ్వకుండా.. తన నటనతోనే భారీగా పాపులారిటీ సాధించింది ఈ అందాల నటి. చిరంజీవి, వెంకటేష్, నాగార్జున లాంటి స్టార్ హీరోలతో జత కట్టిన సౌందర్యను.. తెలుగు ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోరు. కన్నడ కస్తూరి అయిన సౌందర్య.. పేరు, గుర్తింపు మాత్రం తెలుగు సినిమాల ద్వారానే తెచ్చుకుంది. ఆమె మన మధ్య లేకపోయినా.. నటించిన చిత్రాలు మాత్రం ఎప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటాయి.సౌందర్య తండ్రి సత్యనారాయణ అయ్యర్.. ఈయన కన్నడలో నిర్మాతగా, రైటర్‌గా, అలాగే పలు చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. అసలు సౌందర్యకు సినిమాలంటే ఇష్టం లేదు. కానీ ఓ సినిమాకు ఒక చిన్న పాత్ర కోసం అమ్మాయి కావాల్సి వస్తే.. తన కూతురు ఉంది కదా అని సౌందర్యను సెట్‌కి తీసుకెళ్లారు ఆమె తండ్రి. ఆమెకి ఆ సమయంలో సినిమాలు అంటే ఇష్టం లేదు.. సౌందర్య ఇష్టాన్ని ఆమె తండ్రి గౌరవించకపోవడంతో.. తన తండ్రితో మాట్లాడటమే మానేసింది. ఇక అలా సౌందర్య నట ప్రస్థానం మొదలైంది.

సౌందర్య నిర్మించిన చిత్రమిదే..

తండ్రి మరణానంతరం ఆయన పేరు మీదే ఓ నిర్మాణ సంస్థ ప్రారంభించింది సౌందర్య. సత్యం మూవీ మేకర్స్ పేరుతో 2002లో 'ద్వీప' అనే కన్నడ చిత్రాన్ని నిర్మించింది. దీనికి గిరీష్ కాసరవల్లి దర్శకత్వం వహించాడు. ఫిమేల్ ఓరియంటెడ్‌గా తెరకెక్కించిన ఈ చిత్రంలో.. సౌందర్య ప్రధాన పాత్ర పోషించింది. ఇక ఇది బాక్సాఫీస్ దగ్గర పెద్దగా హిట్ అవ్వకపోయినా.. ఈ చిత్రానికి రెండు జాతీయ అవార్డులు లభించాయి. ఈ సినిమా తర్వాత మళ్లీ ఆమె నిర్మాతగా సినిమాలు రూపొందించలేదు.



## ఇవి ఆకులు కాదు.. ఆ సమస్యలకు సంజీవని లాంటివి..



ఆకుకూరల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.. అలాంటి ఆకుకూరల్లో పాలకూర ఒకటి.. పాలకూర ఒక అద్భుతమైన ఆకు కూర అని మనందరికీ తెలుసు.. ఇది రుచికరమైనదే కాదు, ఆరోగ్యం పరంగా చూస్తే చాలా ప్రయోజనకరమైనది. పాలకూరను విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ గొప్ప మూలంగా పరిగణిస్తారు. ఈ కూర మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ముఖ్యమైనది.. డైటీషియన్ల ప్రకారం పాలకూరను రెగ్యులర్‌గా తింటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.. అలాగే పలు అనారోగ్య సమస్యలను నియంత్రించవచ్చు.. పాలకూర మధుమేహం, గుండె జబ్బులతో సహా అనేక ప్రమాదాలను తగ్గిస్తుంది.. దాని సాటిలేని ప్రయోజనాల గురించి తెలుసుకుంటే.. మీరు కూడా ప్రతిరోజూ తింటారు..డయాబెటిస్ లో మేలు చేస్తుంది: పాలకూర వినియోగం మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో ఆల్ఫా-లిపోయిక్ యాసిడ్ ఉంటుంది. ఇది ఇన్సులిన్ స్రావాన్ని ప్రోత్సహిస్తుంది.

శక్తిని ఇస్తుంది : పాలకూరలో ఫైబర్, ఐరన్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శారీరక శక్తిని అందిస్తాయి. దీని ద్వారా అలసట తగ్గుతుంది.

కళ్లకు మేలు చేస్తుంది: పాలకూరలో విటమిన్ ఎ, విటమిన్ కె, లుటిన్ వంటి ప్రత్యేక పోషకాలు ఉన్నాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి.

ఎముకలకు మేలు చేస్తుంది: పాలకూరలో విటమిన్ కె, కాల్షియం పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకలను బలోపేతం చేస్తాయి. బోలు ఎముకల వ్యాధి వంటి వ్యాధులను నివారిస్తాయి.

పేగు ఆరోగ్యానికి మేలు చేస్తుంది: పాలకూరలో ఫైబర్ ఉంటుంది. ఇది పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

చర్మానికి మేలు చేస్తుంది: పాలకూరలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తాయి.

బరువు అదుపులో ఉంటుంది: పాలకూర ఆకుకూరలు తక్కువ కేలరీలను కలిగి ఉంటాయి. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.

గుండె ఆరోగ్యానికి అవసరం: పాలకూరలో పొటాషియం ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇంకా గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది: పాలకూరలో ఫోలేట్ ఉంటుంది. ఇది డిప్రెషన్, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.

నిర్విషీకరణ: వాస్తవానికి పాలకూర ఒక్కటే కాదు.. ఆకు కూరలు యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి.. ఇవి శారీరకంగా సూక్ష్మక్రిములను నాశనం చేయడంలో సహాయపడతాయి.. అలాగే శరీరం నుంచి విషాన్ని తొలగిస్తాయి.

## భారత్‌లో రతన్ టాటా విడుదల చేసిన మొట్టమొదటి స్వదేశీ కారు ఏదో తెలుసా?



ప్రముఖ భారతీయ పారిశ్రామికవేత్త రతన్ టాటా (86) కన్నుమూశారు. టాటా సన్స్ మాజీ చైర్మన్ బుధవారం (ఆగస్టు 9) ముంబైలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో తుది శ్వాస విడిచారు. టాటా గ్రూప్‌లో ఆయన అనేక కంపెనీలను పెంచారు. వీటిలో ఒకటి టాటా మోటార్స్. ఇది నేడు భారతదేశంలోని ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలలో ఒకటి. రతన్ టాటా భారతదేశంలో మొట్టమొదటి స్వదేశీ కారును కూడా విడుదల చేశారు. ఈ రోజు టాటా మోటార్స్ కార్లు వాటి భద్రతకు ప్రసిద్ధి చెందడానికి కారణం కూడా ఆయనే.రతన్ టాటా నాయకత్వంలో టాటా మోటార్స్ మొదటి భారతీయ కారు టాటా ఇండికాను విడుదల చేసింది. 1998లో ఇండికా మొదటి స్వదేశీ కారుగా ప్రదర్శించారు. ఇది కాంపాక్ట్ హ్యాచ్‌బ్యాక్ కారు. ఇది పూర్తిగా భారతదేశంలో రూపొందించబడింది. అందువల్ల ఇది భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ కారు2023 టాటా ఇండికా 25వ వార్షికోత్సవం సందర్భంగా రతన్ టాటా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ కూడా షేర్ చేశారు. భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ కారు టాటా ఇండికా రూపంలో పుట్టిందని పోస్టులో పేర్కొన్నారు. ఈ కారు తన హృదయానికి చాలా దగ్గరైందని రతన్ చెప్పాడు.టాటా ఇండికా భారతీయ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రూపొందించబడింది. అప్పుడు ఒక కాంపాక్ట్, మంచి మైలేజ్ కారు అవసరం ఉంది. ఇండికా చాలా సౌకర్యవంతమైన కారు. ఇందులో చాలా స్థలం ఉంది. మైలేజీ గురించి చెప్పాలంటే, ఇండికా లీటరుకు దాదాపు 20 కిలోమీటర్ల మైలేజీని ఇచ్చేది.

## టీమిండియా పరిస్థితి ఏంటంటే?



పాకిస్థాన్ ఓటమితో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పాయింట్ల పట్టికలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంగ్లండ్ జట్టు పాయింట్ల పట్టికలో భారీ ఆధిక్యం సాధిస్తే.. పాక్ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు సంబంధించి పాకిస్థాన్‌కు దాదాపు తలుపులు మూసుకుపోయాయి. ముల్తాన్ వేదికగా పాక్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు స్వదేశంలో మరోసారి ఘోర పరాజయాన్ని చవిచూసింది. తొలి ఇన్నింగ్స్‌లో 500కు పైగా పరుగులు చేసినప్పటికీ, పాకిస్థాన్ ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. తొలి టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడించడం ద్వారా ఇంగ్లండ్ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పట్టికలో తమ స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది. ఇంగ్లండ్ జట్టు ఇప్పుడు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలను అధిగమించి నాలుగో ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మూడో ఎడిషన్‌లో, ఇంగ్లండ్ ఇప్పటి వరకు ఆడిన 17 మ్యాచ్‌లలో 9 విజయాలు, 7 ఓటములతో 93 పాయింట్లను కలిగి ఉంది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ఇంగ్లండ్ కూడా నిలిచింది.ఇక ఈ టెస్టుకు ముందు బంగ్లాదేశ్ జట్టు చేతిలో పాకిస్థాన్ జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఇప్పుడు ముల్తాన్ టెస్టులో ఇంగ్లండ్ చేతిలో చిత్తయ్యింది. ఈ ఓటమితో ఇప్పుడు పాకిస్థాన్‌కు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు దాదాపు తలుపులు మూసుకుపోయాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ స్టాండింగ్స్‌లో, పాకిస్తాన్ ఎనిమిదో స్థానంలో ఉంది. ఆ జట్టు ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌లలో 2 మాత్రమే గెలిచింది. ముల్తాన్ టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 550కి పైగా పరుగులు చేసినప్పటికీ పాకిస్థాన్‌కు ఘోర పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 7 వికెట్లు కోల్పోయి 823 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ తరపున హ్యారీ బ్రూక్ ట్రిపుల్ సెంచరీ, జో రూట్ డబుల్ సెంచరీ సాధించారు. దీంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 267 పరుగుల ఆధిక్యం సాధించింది. ఈ లక్ష్యాన్ని ఛేదించిన పాక్ జట్టు కేవలం 220 పరుగులకే ఆలౌటైంది. దీంతో సిరీస్‌లో ఇంగ్లండ్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..